

# వికృత శాంతి

కలువకొలను సదానంద

అద్దె యిచ్చేవాళ్ళూ, పుచ్చుకునేవాళ్ళూ అంటారు గాబట్టి—మనస్సు ఒప్పకపోయినా—మనమూ దాన్ని "ఇల్లు" అనకతప్పదు. మనం చూస్తూనే వున్నాం—పులుల్నీ, ఎలుగుబంటుల్నీ పట్టి బోనుల్లో బంధిస్తూ వుంటారు. నీవుగాని, నేనుగాని అ యింటిలో వున్నట్టయితే—"హా విధీ! ఆ బోనులోవున్న మృగాన్ని తెచ్చి యిక్కడ పడేసి, నన్ను తీసుకెళ్ళి ఆ బోనులో పడేయరాదా?" అని వాపోయేవాళ్ళం. కాని—శాంతిసాగర్ మనలాంటి మనిషి కాడు. కాబట్టి అతడలా అనుకోలేదు.

బోనులో గాలి వెలుతురుకైనా ప్రవేశం వుంది. శాంతిసాగర్ అద్దెకుంటున్న గదిలో గాలికి, వెలుతురుకు ఆ అర్హతలేదు. చీమకే గనుక మానవ భాష తెలిసివుంటే—అది ఆ గదిలో నాలుగు మూలలూ తిరిగివచ్చి, "ఓస్! దీనికన్నా మా పుట్ట ఎందులో తీసిపోయింది?" అని సగర్వంగా అనేది. ఆ "చిట్టి" గదిలో ఒకమూల పొగగొట్టము, మరో మూల జలదారి తూము వున్నాయి. ప్రతి సాయంకాలం—సూర్యుడు ఆకాశ రంగంలోనుండి నిష్క్రమిస్తూ ముఖం ఎర్రగా కందిపోయేటట్లు ఏడవడానికి కారణమేమిటంటే—"శాంతి సాగర్ యింట్లో ఏముందో ఈ రోజుకూడా చూడలేకపోయానే ....." అన్న చింత ఒక్కటే! ఆ యింట్లో వెలుతురు స్థానాన్ని చీకటి, గాలి స్థానాన్ని—జలదారి తూములోనుండి గుప్పున ఎగసి వచ్చే దుర్గంధమూ ఆక్రమించుకొన్నాయి. ఆ చెడువాసనకు

భయపడి, గుమ్మందాటి బయుట నిలబడడానికైనా వీలులేదు. ఆ యింటికి ఎట్ట ఎదుట వరుసగా చిన్న చిన్న పాయఃఖానా దొడ్లు నాలుగున్నాయి. ఆ యింటిని చూస్తే అక్కడున్న మరి నాలుగైదు యిళ్ళను కూడా చూడవలసిన అవసరమే లేదు. ఆ యిళ్ళనన్నిటినీ వీధితో కలుపుతూ ఒక సన్నటి సందు.

......ఇక చెప్పు!......బంధింపబడ్డ వన్య మృగం బోనులోనైనా వుండగలగడం దాని పుణ్యమా, కాదా?........శాంతిసాగర్ యిలా అని ఎప్పుడూ అనుకోలేదు. కాని—చాలకాలం తర్వాత అతడి ఓరిమి చచ్చిపోయి, "ఛీ! ఈ నరకంలో వుండటానికన్నా—ఏ అడవిలోనికో పారిపోవడం మేలు!........" అని విసుక్కున్నాడు. అందుకు ఆ యింటి యొక్క అవలక్షణాలు మాత్రం కారణాలు కావు.

• • •

శాంతిసాగర్ ముద్దుపేరు శాంతి. మనసులో తీయని కోరిక లూరించే ఇరవైఏండ్ల పడుచు వయస్సు అతనిది. నీరసంగా కనిపించే బక్కపలచని శరీరం, ఉంగరాలు తిరిగిన గిరజాల జుత్తు, కొద్దిగా మాసిన చిరుగడ్డం, మెడలో వెండి తాయెత్తు, తెల్లటి పైజామా, చొక్కా—ఆ బస్తీలో అతని పరిచయమల్లా యీ రూపంతోనే. ముద్దులు మూటగట్టే అందమైన ముఖం అతనిది. అతడి కన్నుల్లో ఎప్పుడూ ఏదో భయమూ, అనుమానమూ దోబూచులాడుతూంటాయి.

శాంతి చెడిపోయాడు. మదిర, మదవతి, జూదమూ అతన్ని చెరిపాయి. వినోదమూ, విలాసమూ అతడి పూర్వీకుల సొత్తు. నోటికి 'అమృత పాత్ర'ను అందిస్తూవున్న 'రంభ'ను ఒక చేత్తో పొదివి పట్టుకుని, మరో చేత్తో రూపాయల బంటుల్ని కదలించి చదరంగమాడారు వాళ్ళు. కాని—వాళ్ళు చెడిపోలేదు. ఆ మూడు వ్యసనాలను హాయిగా అనుభవించింది వాళ్ళు; తత్ఫలితాలను అనుభవిస్తూన్నవాడు శాంతి.

తల్లీ,తండ్రీ, అప్పులూ—అతని కేదీలేకుండా చేసి, తమ పాత్ర అంతే నన్నట్లు జీవిత నాటకం నుంచి నిష్క్రమించారు. ఇక అతనికి మిగిలినవి రెండే రెండు. తన పేరు, తన పెద్దల ప్రతిష్ఠ. అదృష్టంపైన భారంవేసి, ఆ రెంటినీ వెంటబెట్టుకుని స్వగ్రామంనుండి బయులుదేరాడు. బస్తీ చేరుకున్నాడు. దేవుడు చల్లగా చూస్తే తనకో వుద్యోగం దొరక్కపోతుందా అనుకుంటూ గృహాన్వేషణ కొనసాగించాడు. అతనికి చాలా యిళ్ళు నచ్చాయి. కాని, ఆ యిళ్ళకు శాంతి నచ్చలేదు. అతడు స్తోమతులేనివాడు. చివరికి—బోనుకన్నా హీనంగా, చీమల పుట్టకు సామ్యంగావున్న ఆ యింట్లో కాలు మోపాడు.

అతనిలో కొన్ని మూఢ నమ్మకాలు జీర్ణించుకుపోయాయి. చిన్నప్పటినుంచీ అతడు పెరిగిన పరిసరాలు అటువంటివి. అతడా యింటిలో

*శకునపక్షుల కూతలు, అనుమాన పిశాచాలు, భగ్న ప్రేమలు, ప్రమరణ భాగ్యానికి నోచుకోని కథలు, అంతరాత్మ మూక ఘోషలు — ఇవి తండ్రి తాతల పుణ్యమా అని శాంతి కరువు అయిన 'శాంతి'కి పర్యాయపదాలు. తీరా అదృష్టం వరించింది. కాని, శాంతి చేకూర్చే దేమిటో 'శాంతి'కే తెలియదు!*

అద్దెకుచేరి ఆరు మాసాలు కావస్తూంది. ఈ ఆరు మాసాల్లో అక్కడి పరిసరా లేవీ అతన్ని బాధించలేదు. ఇంట్లోని చీకటి, తూములోనుండి వచ్చే కంపు, నరవాసన సోకగానే చతురంగ బలాలతో చుట్టు ముట్టే నల్లుల దండు, గాలి లేనందువల్ల కలిగే వుక్క, రోత పుట్టించే పాయఖానా దొడ్లు—వీటి నెప్పుడూ అతడు కంటగించుకోలేదు. అక్కడి మనుషులవల్ల, ఆ వాతావరణంవల్ల అతడికి అక్కడి బ్రతుకు దుర్భర మనిపించింది.

ఊళ్ళోని విధవలనంతా అక్కడ కాపురంవున్న కుటుంబాలే పంచుకున్నట్టుంది. ప్రతి యింట్లో ఒక విధవ శాంతిసాగర్‌కు కంటకప్రాయంగా జీవిస్తోంది. అక్కడ ఎలుకల బెడద ఎక్కువ. వాటి బెడద లేకపోతే పిల్లల బెడద వుండేదేకాదు. ఇక అన్నిటికన్నా దుర్భరం—ప్రక్క యింట్లో దర్జీవాడి కూతురు. ఎంత చచ్చీ చెడీ, రేయింబవళ్ళు లబలబలాడినా — దర్జీవాడి కుట్టుమిషను ఒక్క ఆదివారం పూటనైనా నిశ్శబ్దంగా వుంటుంది గానీ—దర్జీవాడి కూతురు మాత్రం ప్రతి మూడు నిమిషాలకోసారి తుమ్మకపోతే జీవించలేదేమో!

శాంతిసాగర్ నిద్ర లేవగానే—ఒక విధవ తన దివ్యదర్శనంతో అతని నయనాల్ని పావనం చేస్తుంది. అత డెక్కడికైనా పనివుండి బయులుదేరితే ఒక పిల్లి అతని కాళ్ళ సందులో దూరుతుంది. ఇంట్లో కూర్చుని హాయిగా ఏదో తీయటి కలగంటూ వుంటే దర్జీవాడి కూతురు "హాచ్!" "హచక్!" అంటూ పరంపరగా తుమ్ముతూ వుంటుంది. అది శస్త్ర పరంపరగా అతడి చెవుల్ని తూటుచేసి అతడి గుండెమీద గాటు వేస్తుంది.

వీళ్ళవల్ల, ఈ 'శకునపక్షుల'వల్ల — తన జీవితమంతా సర్వ నాశనమైపోతూ వుందని శాంతిసాగర్ ప్రగాఢ విశ్వాసం. అతను అలా అనుకోడానికి కారణాలు అనేకం వున్నాయి!.....కథలు వ్రాయాలన్న అభిలాష అతనికి మెండు. ఇటీవల ఒక తెలుగు పత్రిక కథానికల పోటీ నిర్వహిస్తూ, నూటపదార్ల బహుమానం ప్రకటించింది. శాంతిసాగర్ ఒక కథ వ్రాశాడు. వ్రాస్తూ వ్రాస్తూ—"నా కథ తప్పకుండా పోటీలో గెలుస్తుంది" అనుకున్నాడు.

"నూటపదార్లు చేతి కందగానే....."

> *అందమైన భార్యా, పెరటి గుమ్మము ఉండే కుబేరుడు కూడా అచిరకాలంలో కుచేలుడు కావచ్చు.*
>
> —ఇటాలియన్ సామెత

ప్రక్కింట్లో దర్జీవాడి కూతురు "హాచ్" అని తుమ్మింది. శాంతిసాగర్‌కు చిర్రెత్తుకొచ్చింది. పోటీకి అతడు పంపిన కథ తిరిగి వచ్చింది.

శాంతిసాగర్ ఒక అమ్మాయిని ప్రేమించాడు. వెంటనే ఆమె దగ్గర కెళ్ళి "నువ్వుగాని ప్రేమిస్తున్నా వేమిటీ?" అని అడిగాడు. ఆమె "అవు"నంది. "ఎవరిని?" అన్నాడు శాంతిసాగర్. "ఎవరినేమిటీ? డబ్బును!"........అంది ప్రేమింపబడుతూన్న అమ్మాయి. "అయితే డబ్బునుతప్ప మరెవరినీ పెళ్ళాడవా?" అన్నాడు శాంతిసాగర్ దీనవదనంతో. ఆ అమ్మాయి—"నేను డబ్బును ప్రేమిస్తున్నాను గాబట్టి డబ్బున్న మనిషైనా ఫరవాలేద!" అని తన నిబంధనను కొంచెం సడలించింది. శాంతి వెంటనే ఒక లాటరీ ఏజంటు దగ్గరికి వెళ్ళాడు. ఒక రూపాయి యిచ్చి లాటరీ చీటీ కొన్నాడు. ఇంటికి వచ్చి కళ్ళు మూసుకుని పడుకున్నాడు. లక్ష రూపాయలూ తనకే వచ్చేస్తుందని మురిసిపోయాడు. శాంతిసాగర్ హతాశుడయ్యేలా ప్రక్కింట్లో పిల్ల గట్టిగా తుమ్మింది. "ఓసి దీని దుంపదెగ! ఇది మాయాదర్పణం పెట్టుకుని ఎప్పుడూ నా మనస్సునే చూస్తూవుంది గాబోలు! ఆ లక్ష్మణుడు మళ్ళీ జన్మయెత్తి దీని ముక్కు కూడా కాస్త కోసుకుని పుణ్యం గట్టుకోరాదూ?......" అనుకున్నాడు. లక్ష్మికి తాను నచ్చ లేదేమో—లక్ష రూపాయల్ని లోకానికంతా పంచిపెట్టింది. డబ్బును ప్రేమించిన అమ్మాయి డబ్బున్నవాణ్ణే పెళ్ళాడేసింది. దర్జీవాడి కూతురు తుమ్మకపోతే తన ప్రేమ భగ్నమయ్యేదే కాదు.....

తనకు ఉద్యోగం వస్తుందని రోజూ చాలాసార్లు అనుకుంటాడు. ఆ పిల్ల తుమ్ముతుంది. ఇంతవరకు ఉద్యోగం రాలేదు. ఉద్యోగాన్ని గాలించడం కోసం బయులుదేరినప్పుడంతాపిల్లులు, వితంతువులు ఎదురౌతారు. ఉద్యోగం కనుచూపు దూరంలో ఎక్కడా కనిపించలేదు. ప్రతి ఉదయం—ఎదురైన పిల్లుల్నీ, విధవల్నీ తిట్టుకుంటూ పోస్టాఫీసుకు వెళ్తాడు. అతడు పంపిన కథలు తిరిగి వస్తాయి. అతని కథా వస్తువు—'శకునాలు'. వాటిని సమర్థిస్తూ బాల సాహిత్యపు స్థాయిలో కథలు వ్రాశాడు. అవి తిరిగి రావడానికి—ఈ పిల్లులు, విధవలు, తుమ్ములు కారణాలనుకుంటాడు. నిజమైన కారణం—అతడి కథల్లోని వితంతువులు, తుమ్ములు, పిల్లులు అని అతడనుకోడు.

శాంతిసాగర్ చిన్నప్పటినుండీ నిరాశలో పెరిగాడు. ఎన్నో అపజయాలకు తల ఒగ్గాడు. అతడు సంతోషించదగ్గ సంఘటన జీవితంలో యింతవర కెప్పుడూ జరుగలేదు. అందుకే అతడు

అవాంతరాలన్నా, అపశకునాలన్నా అంతగా హడిలి పోతాడు. ఏ పని చేయబోయినా—ముందు అశుభకరమైనటువంటి, అమంగళకరమైనటు వంటి ఆలోచనలే అతని మనస్సులో మెదులు తాయి. సత్ఫలితాలేవీ కానరాకపోగా—తన ఆలో చనలను అందుకు కాకతాళీయంగా ముడిపెట్టి తన మనసులో నాటుకొన్న మూఢ విశ్వాసాలను నానాటికీ మరింత గాఢతరం చేసుకుంటాడు.

నిజానికి—ఉద్యోగంకోసం అతడుపడ్డ శ్రమ, ప్రయత్నము చాల తక్కువ. కాని, ఆనింద తన మీద వేస్తే ఒప్పుకోడు అతడు. వంశపారంపర్య మైన సోమరితనము, నిర్లక్ష్యము శాంతిసాగర్‌కు మరికొంత ఎక్కువ మోతాదులో సంక్రమిం చాయి. ఉద్యోగం ఏనాడో ఒకనాడు హఠాత్తుగా వూడిపడుతుందని అతని నమ్మకం. తనకు తెలిసిన మిత్రులకు, దూరపు బంధువులకు, యింకా ఎవరెవరికో ఉత్తరాలు వ్రాస్తూవుంటాడు. ఏ ధర్మాత్ముడో ఒక ధర్మాత్ముడు అతడికి డబ్బు పంపుతూ వుంటాడు. ఆ స్వల్పమైన రాబడితో అతని బ్రతుకు కొనసాగడం చాల కష్టంతో కూడిన కార్యం. బట్టలు మాసిపోయినా, స్నాన పానాదులు లేకపోయినా శాంతిసాగర్ రోజుల తర బడి ఆ యింట్లోనే వుండిపోగలడు. అతను కడుపు నిండా అన్నం తిన్న వేళలకన్నా పస్తులున్న వేళలే ఎక్కువ. అయినా అతడు ఆకలిని సైతం అవ లీలగా జయించగలడు. ఆ విజయానికి సాధనాలు —అతని మధురోహలు, తీయని పగటి కలలు. శాంతిసాగర్ పగటిపూట మత్తుగా నిద్రపోతాడు. రాత్రులంతా మేలుకుని తీయని తలపోతలతో స్వర్గసీమలు నిర్మించుకుంటాడు. అది ఎన్ని జన్మాల పుణ్యమో గాని, ఆ సుఖం అందరికీ ఎలా దక్కుతుంది?.....

అతడి తలపోతలు రకరకాలుగా వుంటాయి. అతడు ఏ చలన చిత్ర నిర్మాతగానో, దర్శకుడు గానో వున్నట్టయితే—చిత్ర విచిత్రమైన జాన పద చిత్రాలు కోకొల్లలు నిర్మించివుండేవాడు. కాని, తన ఊహాలోకంలో, స్వప్నసీమలో అత డొక నాయకుడు కావడంచేత ఆంధ్రప్రేక్షక లోకానికి అంతటి సౌభాగ్యం కలుగలేదు.

అతని తలపోతల్లో—ఒక ఊహాసుందరి కనిపిస్తుంది. ఆమె తండ్రికి ఆమె ఒకతే కూతురు. ఆమెకు కోట్లకొలది రూపాయల ఆస్తిపాస్తులు. ఆ యింట్లో ఆమె మాటంటే వేదవాక్కు. ఆసుందరి తనవెంట బడింది. తనను మనసారా ప్రేమించింది. అది పవిత్రమైన ప్రేమ. ప్రగాఢమైన ప్రేమ. లోకమంతా ఆశ్చ ర్యంతో ముక్కున వేలేసుకొని చూస్తూండగా ఆకాశమంత పందిరిక్రింద, దేవేంద్ర వైభవా లతో తమ యిద్దరి వివాహం సర్వజన రంజకంగా జరుగుతుంది. అప్పుడు—తాను, తన ప్రేయసి ఒకరినొకరు ప్రేమ వెల్లువలో ముంచి ఎత్తుతూ వుండగా—తన మామగారు హఠాత్తుగా గుండె ఆగి చనిపోతారు. తర్వాత యావదాస్తికి తానే సర్వాధికారి!.......ఈ కల మచ్చుకు మాత్రమే!

# వికృత వాణి

అతడు కలగనని నిమిషం వుండదు. దర్జీవాడి కూతురికి తుమ్మని నిమిషం వుండదు. ఆ సమయంలో శాంతిసాగర్ పర్వతాగ్రంనుండి అథా తలంలోకి దబాలున జారిపడి, తన స్వప్నం కాదు గదా—జీవిత స్వప్నమే కరిగిపోయినంత బాధపడ తాడు. క్రమంగా అతని ఓపిక చచ్చిపోయింది. అందుకే విసుక్కున్నాడు—"ఛీ! ఈ నరకంలో వుండటానికన్నా ఏ అడివిలోనికో పారిపోవడం మేలు!"—అని.

ఒక రోజున అతని నవనాడుల్నీ కృంగదీసిన కల ఒకటి వచ్చింది. ఆ కలలో తనకు, ఆ దర్జీవాడి కూతురికి పెళ్ళయింది.....శాంతిసాగర్ ఆ పెళ్ళి లోనే హడిలిపోయాడు. మెలకువ వచ్చిన తరువాత మరీ హడిలిపోయాడు. అది తెల్లవారుజామున వచ్చిన కల. తెల్లవారుజామున వచ్చిన కలలు నిజ మౌతాయని అంటారు.అది—వాస్తవమేనేమో!... తనకూ, ఆ పిల్లకూ కొన్నాళ్ళలో పెళ్ళి అవు తుంది. ఆ పిల్ల పెళ్ళిలోనే తుమ్ముతుంది. తర్వాత—తన జీవితమంతా తుమ్ముల మయం! ఆ తుమ్ములరాణి 'అ'మ్ముల ధాటిని భరించలేక తను ఎప్పుడో ఒకప్పుడు గుండెఆగి చచ్చిపోతాడు.. కాబట్టే యిప్పుడే జాగ్రత్తపడాలి. ఇంకా యీ యింట్లో వుంటే—బలవంతంగానైనా తనకు ఆ పిల్లనిచ్చి పెళ్ళి చేస్తారు. ఈ యింట్లో మకాం ఎత్తేయాలి!

అతడి పాత చెప్పులకు ఆనాటితో ఋణం తీరిపోయింది. అద్దెకొంపకోసం అతడు బస్తీ అంతా తెగతిరిగాడు. అతని ప్రయాస వృధా కాలేదు. బస్తీ మొత్తానికి ఒక యిల్లు కని పించింది. ఆ యిల్లు శిథిలావస్థలో వుంది. ఇటుక రాతి మిద్దె. ఆ మిద్దెకు సమీపంలో ఎక్కడా యిళ్ళు లేవు. అది శాంతిసాగర్ కళ్ళకు పేదవాడి పాలిటి పెన్నిధిలా కనిపించింది.

• • •

శాంతిసాగర్ ఆత్మబలంవున్న మానవుడే అయితే—అతడు జీవిత పథంలో సుగమంగా నడిచి పోగలిగేవాడే. కాని, అతని ఆత్మకు బలం లేదు. అతని అంతరాత్మలో తిష్ఠ వేసుకొనివున్న వికృత మైన మూగ వాక్కు అతని ఆత్మను దుర్బలంగా చేసి, భయానుమానాల్ని రెచ్చగొట్టి, అతన్ని వికృతాతి వికృతంగా శాసిస్తూంది. అతడా వికృత వాణికి లొంగిపోయాడు. అది అతన్ని నేరుగా సాగిపోనీయక—అడుగడుగునా కళ్ళెంవేసి ఆపుతూ

> *మీకు తెలిసినదంతా ఎప్పుడూ చెప్పకండి ; చెప్పేది ఏమిటో మాత్రం ఎప్పుడూ తెలుసుకోండి.*
>
> —క్లాడియస్

మలుపులు త్రిప్పుతోంది. మలుపు మలుపునా— అశాంతి—కప్పకోసం దృష్టిసారించే పాములాగా పొంచి చూస్తున్నది. శాంతిని తన పొట్టను బెట్టుకోవడమే గదా అశాంతియొక్క స్వభావం?..

శాంతి తన ఆస్తిపాస్తులనంతా ట్రంకు పెట్టెలో సర్దుకుని, సిరిచాప చేతబట్టుకొని తన పాలిటి నరకంనుంచి ఆ యిటుకరాతి మిద్దె లోకి ఆ మధ్యాహ్నమే మకాం మార్చేశాడు. నాటి నుంచీ తన జాతకం మారిపోతుం దనుకున్నాడు. అతడు తన జీవితంలో సంతోషానికీ, సంతృప్తికీ నోచుకున్న రోజు ఆ ఒక్క రోజే!.....

తన క్రొత్త బసలో శాంతి కొన్ని క్షణాల పాటు మాత్రమే శాంతిని, ప్రశాంతతను పొంద గలిగాడు. అతని దృష్టి మెల్లగా ఆ యింటి స్వరూపం మీదికి, అక్కడి పరిసరాల మీదికి మరలింది. అతని గుండెలో మళ్ళీ గుబులు ప్రారంభమైంది.........అది చాలా పెద్ద గది. రెండు కిటికీలున్నాయి. కిటికీలకు రెక్కలులేవు. ఇంటి తలుపు సగానికి సగం చెదపురుగులవాత బడింది. గోడల అడుగున రెండు మూడు అడుగుల ఎత్తువరకు ఇటుక రాళ్ళు చివికిపోయి, ఎర్రటి ఇటుకరాతిపొడి జలజలమని నేలమీద రాలు తూంది, గోడలు తాపుకు విరిగిపడేటట్లు— పెరుసు బారిపోయాయి. ఇంటి పైకప్పు అర్థ గోళాకారంగా కృంగిపోయింది. ఇంటి మధ్యభాగాన పై కప్పుకు పూతగా ఒక లావాటి కొయ్యస్తంభం నిలబెట్టబడివుంది. ఆ కొయ్య పొడవు చాలనందు చేత—నేలమీద రెండు మూడు రాళ్ళు పేర్చి, దానిపైన ఆ కొయ్యను నిలబెట్టి వున్నారు. పైనుండి కూడా మన్ను కొద్ది కొద్దిగా రాలు తూంది. ఇల్లంతా గబ్బిలాల వాసన. ఇంటి వాసా లన్నీ బూజుపట్టి వున్నాయి. మూలల్లో సాలె పురుగులు కాపురం ఏర్పరచుకొన్నాయి. ఆ యింట్లో కూర్చుని ఏ తపస్వి కూడా చిత్తాన్ని శివుడిమీద నిలుపలేడు.....

ఆ యింటిని పరిశీలనగా చూశాక—శాంతి శరీరం ఒక్కసారిగా జలదరించింది. "ఈ యింటి కాలం దాపురించింది. దురదృష్టవశాత్తూ నేను నిద్రపోతున్న సమయంలోనే యిది కాస్తా కూలి పోయిందంటే నాగతి ఏం కాను?" అనుకున్నాడు. గోడమీద కిచకిచమంటూ గౌళి పలికింది. దూరంగా బడిగంట గణగణ మంటూ మ్రోగింది. శాంతి హడిలిపోయాడు. ఒళ్ళంతా వణుకు పుట్టింది. అతనిలో అశాంతి విజృంభించింది. ఇంట్లోకి, బయటికి కాలుగాలిన పిల్లిలా తిరి గాడు....నిరపాయకరమైన యింటిని వదలిపెట్టి మృత్యు మందిరంలోనికి నడిపించిన తన అవి వేకాన్ని నిందించుకొన్నాడు.

ప్రొద్దు పోయింది. శాంతి—యింటిలో దీపం వెలిగించుకున్నాడు. అతనికి మనస్థిమితం లేదు. వెలుగులు అంతరిస్తున్నాయి. సంధ్య—దిగులు

(తరువాయి 47 వ పేజీలో)

# వికృతవాణి

(42 వ పేజీ తరువాయి)

గుండెలో, మూకీభావంతో కొన్ని క్షణాల కాలం భూదేవి హృదయసీమపైన దిక్కుతోచక విల విలలాడింది. వెలుగుకు అంతిమదశ, చీకటికి ప్రారంభ దశ—సంధ్య అంతమైంది. చీకటితో పెనగులాడి పెనగులాడి ప్రయోజనంలేక చీకటి కౌగిట్లోకి ఒదిగిపోయింది.

ఇంట్లో గ్రుడ్డి దీపం వేదాంతిలా వెలుగుతూంది. శాంతి అనుమాన పిశాచంవల్ల అల్లకల్లోలమైన హృదయంతోగుమ్మంలోనిలబడ్డాడు. ఆకాశంకేసి చూశాడు. ఆకాశం కూడ అతని మానసంలాగా మేఘాలతో, అస్పష్టమైన ఉరుములతోనిండి అల్లకల్లోలంగా వుంది. వానగాలి రివ్వున వీస్తోంది. లోకమంతా చీకటితో నిండిపోయింది. వానగాలి ధాటి ఆగి కొంతసేపుర ప్రశాంతత ఏర్పడింది. తరువాత మెల్లగా చినుకులు రాలడం ప్రారంభమైంది. చినుకులన్నీ జవమూ, బలమూ చేకూర్చుకొన్నాయి. హోరుమంటూ వర్షం కురుస్తూంది. శాంతి గుమ్మంలో నుంచి కదల్లేదు. గాలికి వూగిపోయే ఎండుటాకులా అల్లాడిపోతోంది—అతని హృదయం ఇంట్లో దీపం చమురు చాలక ఆరిపోతూంది. లోపలికి కిరసనాయిలు పోయడానికైనా అతనికి ధైర్యం లేకపోయింది.....దీపం ఆరిపోయింది. వానజల్లు కిటికీలగుండా లోపలికి వచ్చిపడుతూంది. గుమ్మంలో నిలబడ్డ శాంతి సగం తడిసిపోయాడు. అతని అనుమానం బలపడింది. పై కప్పులో నుండి ఏదో రాలిపడ్డట్టు చప్పుడు వినిపించింది... "అదిమన్నే!.. సందేహం లేదు!...వానకు యిల్లు తడిసి మన్ను కరిగి రాలిపోతూంది....ఇకకొద్ది సేపట్లో క్రమంగా యిల్లే కూలిపోతుంది. లేక పోతే మధ్యాహ్నం గౌళి ఎందుకు పలుకుతుంది?... గంట ఎందుకు మ్రోగుతుంది?....ప్రమాదం నుంచి తప్పించుకోవాలి!....." అనుకున్నాడు శాంతి. తలుపు మూసి, వానలో తడుస్తూ—యింటి ముందరున్న ఒక పెద్ద నేరేడు చెట్టు క్రిందికి పరుగెత్తాడు.

నేరేడుచెట్టు వర్షం బారినుండి అతన్ని రక్షించలేకపోయింది. వర్షంలో తడుస్తూ శాంతి మిద్దెకేసి చూస్తున్నాడు. కాసేపటికి మిద్దె పడిపోతుంది. ఈ రాత్రికి తాను ఎక్కడ తల దాచుకోవాలి? ఆ యింటికి కూతవేటు దూరంలోవున యిళ్ళు లేవు......మెరుపుల కాంతిలో దూరంగా—యింటి యజమానిగారి మేడ కనిపించింది. వేరుగా అక్కడికి పరుగెత్తుకెళ్ళితే?........తన భయాన్ని చూసి ఆయన నవ్వరూ?

ఉన్నట్టుండి—దూరాన ఎక్కడో ఫెళ ఫెళ మంటూ పిడుగు పడింది.... శాంతి గుండె గుభిల్లుమంది!......కొంపదీసి తన నెత్తిన కూడా పిడుగుపడదు కదా?...

అతని నెత్తిన పిడుగుపడలేదు కాని—వర్ష ధాటికి ఆగలేక నేరేడుకొమ్మ ఒకటి విరిగిపడింది. ఆ గాఢ నిశీథిలో ఉరుములు, మెరుపులతో అల్లకల్లోలంగావున్న జలప్రళయంలో భయంకరంగా ఒక్క గావుకేక పెట్టి, శాంతి నేరేడు కొమ్మతో పాటు నేలమీదికి ఒరిగాడు.

• • •

వర్షం ఆగింది. శిథిలం కానున్న గృహం వర్షంతో ధైర్యంగా పోరాడి, విజయాన్ని సాధించి, తన ఆత్మాభిమానాన్ని ప్రకటించుకొంది. కాని, క్రిందికి ఒరిగిపోయిన శాంతి మళ్ళీ పైకి లేవలేదు. అతడు స్పృహ కోల్పోయాడు. అతని తల తీవ్రమైన గాయానికి గురియై రక్త సిక్తమైంది. తెల్లవారగానే—మొట్టమొదట అతనిని చూచినవాడు యింటి యజమాని. అతడు వెరగు పడిపోయాడు. మనుషులచేత శాంతిని ఆ యిటుక రాతి మిద్దెలోకి చేరవేశాడు. ఇంటినుండి నులక మంచం తెప్పించి, దానిమీద అతన్ని పరుండ బెట్టాడు.

శాంతి శరీరం నిప్పులా కాలిపోతోంది. అతడు మాటిమాటికీ స్పృహ కోల్పోతున్నాడు. కన్నులు తెరచుకున్నప్పుడు కూడ అతని కేమీ తెలియడం లేదు. తానెక్కడున్నాడో అతనికి తెలియదు. తెలిస్తే—మరోసారి చావుకేక పెట్టేవాడు. కన్నులు అరమోడ్పుగా మూసుకుని ఏమేమో కలవరిస్తాడు......."ఇల్లు తప్పకుండా పడిపోతుంది......అమ్మ బాబోయ్! పిడుగు! పిడుగు! ఆ తుమ్ముల పిల్లను చంపేయాలి. ఈ వెధవ ముండల్ని కొమ్మంలోపెట్టి కాల్చేయాలి!....అపశకున పక్షులు! నా ఆశలంతా బూడిద జేసేశారు. .....లక్ష రూపాయలు పోయాయి. నా ప్రేమ ముక్కలైపోయింది. ఇల్లు కూలిపోతుంది.....నా బతుకు ముక్కలైపోతుంది....."

అతని పరిస్థితి చూచి భయపడి, యింటి యజమాని డాక్టరుకోసం కబురంపాడు. డాక్టరు వచ్చాడు. రోగిని పరీక్షించాడు. తలకు కట్టు గట్టాడు. చాలా ప్రమాదమన్నాడు. అయినా ప్రయత్నిస్తానన్నాడు. ఎందుకైనా మంచిది— రోగి బంధువు లెవరైనా వుంటే వారికి కబురంప మన్నాడు.

ఇంటి యజమాని శాంతి పెట్టెలోని ఉత్తరాల కట్టనంతా గాలించి, ఒక చిరునామాను బయటికి లాగాడు. భూపతిరావు అనే ఆయన చిరునామా అది. ఆయన శాంతికి దూరపు చుట్టం. అతడికి టెలిగ్రాం వెళ్ళింది.

భూపతిరావు వచ్చాడు. శాంతి మూడు రోజుల పాటు మంచంమీదనే పడివున్నాడు. అతని జ్వరం తగ్గడానికి బదులు నానాటికీ హెచ్చిపోయింది. నాలుగోనాటి ఉదయం డాక్టరు అతన్ని పరీక్షించి, "నన్ను మించిన డాక్టరు యీ ప్రపంచంలో మరెవడూ లేడు. ఒక్కడున్నాడు! వాడు దేవుడు! .....ఇక వాడే దిక్కు!........" అంటూ అక్కడి నుంచి నిష్క్రమించాడు.

> *మన దేశంలో 38,64,39,512 మంది ఉన్నారు. వారిలో బహుశా 512 మందికి మాత్రమే ఎలా మాట్లాడాలో తెలుసు. వాళ్ళు ఎవరూ మా ఊళ్ళో లేరు.*
>
> —ఒక పట్టణంలో సభలు జరిగే ప్రదేశంలో నోటీసు.

శాంతి బ్రతుకుతాడన్న నమ్మకం అందరిలో సడలిపోయింది. అంతిమ క్షణంకోసం ఎదురు చూస్తూ—యిరుగు పొరుగు జనాలందరూ అతని మంచం చుట్టూ గుమిగూడారు. శాంతి కళ్ళప్పగించి అందరికేసి ఒకమారు చూశాడు. భూపతి రావుకేసి చూశాడు. మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

అతన్ని చూడడానికి ఆ దర్జీవాడి కూతురు కూడా వచ్చింది. అతని ముఖాన్ని చూస్తూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూంది. అతడంటే ఆమెకు వల్లమాలిన అభిమానం. కారణం—"అతడు చాలా మంచివాడు!......"

ఇంతలో యింటి ముందర నిలబడ్డ పోస్టు మన్ భూపతిరావు చేతికి ఒక కవరు అందించాడు. భూపతిరావు కవరు విప్పాడు. శాంతిసాగర్‌కు ఉద్యోగం వచ్చింది. అతడు ఆ కాగితాన్ని చేత బట్టుకున్నాడు. అతని మనస్సులో మళ్ళీ ఒక ఆశారేఖ మెరిసింది. ఉద్యోగ వార్త ఆధారంగా శాంతిని మళ్ళీ బ్రతికించగల మేమోనన్న పేరాశ అది. భూపతిరావు అతనికి దగ్గరగా జరిగాడు..... "ఇదిగో! నాయనా!......శాంతీ! ఇటు చూడరా! నీకు ఉద్యోగం వచ్చిందిరా!....కళ్ళు తెరవరా! ఇదిగోరా! నీకు ఉద్యోగం వచ్చిందిరా బాబూ!..."

......శాంతికి యీ మాటలు వినిపించలేదు. ఆ సమయంలో అతడు ఒక విధమైన తాత్త్వికజిజ్ఞాసలో వున్నాడు. అతనికి మృత్యుదేవత స్వాగతమిస్తూ కనిపిస్తూంది....తాను యిక బ్రతుకడు. తాను బ్రతికివున్నాళ్ళు కష్టాలే అనుభవించాడు. తనకు తెలిసినంతవరకు తానే పాపమూ చేయలేదు. నరకాన్నంతా యిక్కడే అనుభవించేశాడు. ఇక మిగిలింది—స్వర్గం! తాను చచ్చిన తరువాత తప్పకుండా తనకు స్వర్గం లభిస్తుంది.. అనుకుంటున్నాడు శాంతి. అతడు స్వర్గానికే పోతాడో, నరకానికే పోతాడో మనకు తెలియదు గాని—పాపం—ఆఖరి క్షణంలో కూడా అతన్ని అశాంతి పట్టి పీడించింది. అతడలా అనుకుంటూ వున్న సమయంలోనే దర్జీవాడి కూతురు "హాచ్" మని తుమ్మింది. ఆమె తుమ్మడం—జీవన సంధ్యలో కొట్టుమిట్టాడుతూన్న శాంతి కర్ణపుటాలకు శూలంగాసోకింది. అది విని, అతడువెంటనే అశాంతి కౌగిట్లో కన్ను మూసేశాడు. ★